సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 25 । డిసెంబర్ । 2023

హ్యాపీ క్రిస్మస్

ఆదిలాబాద్: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. క్రీస్తు జన్మదినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమయ్యాయి.



తాంసిలోని సెయింట్ థామస్ క్యాథలిక్ చర్చిలో అర్ధరాత్రి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గరిష్టం/కనిష్టం
30.0/10.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆదిలాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. విద్యుత్‌ఉద్యోగుల సంఘం (1104), జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను వేర్వేరుగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఇదిలా ఉండగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీల్లో ఉద్యోగులపై భారం పెరుగుతోందని, సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమాల్లో విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విలాస్, జిల్లా కార్యదర్శి కిరణ్ నాయుడు, సత్తయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణ, రామ్ మోహన్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, అరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న ఈపీఎఫ్ శిబిరాలు

మంచిర్యాలటౌన్:ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈనెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారుల సమావేశాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సమావేశాలను ఆయా జిల్లాల పరిధిలో ఉన్న పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచిర్యాలలో మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్సు హాల్‌లో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో, నిర్మల్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. శిబిరంలో ఈసీఆర్, ఇతర రాబడులు, కేవైసీ సీడింగ్, సభ్యుల వివరాల దిద్దుబాటు, అప్‌డేట్, ప్రధాన యజమానులు, కాంట్రాక్టర్లు, యూఏఎన్ జనరేషన్, యాక్టివేషన్ వంటి సేవలు అందిస్తామని తెలిపారు.

గిరి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని జైభారత్ టీం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్ అన్నారు. మాన్కాపూర్ గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించడం లేదన్నారు. ఉట్నూర్ నుంచి నార్నూర్ వరకు, నార్నూర్ నుంచి భీంపూర్, కొత్తపల్లి-హెచ్, మలేపూర్, మల్లెంగి మీదుగా ఆసిఫాబాద్ వరకు బస్సులు నడిపించాలని అన్నారు. అలాగే నార్నూర్ నుంచి బాబేఝరి, సుంగాపూర్, చోర్‌గావ్ మీదుగా ఇంద్రవెల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

- నేరడిగొండ జెడ్పీఎస్‌ఎస్‌లో ఓ ఉపాధ్యాయుడు ఇటీవల విద్యార్థినులపై వేధింపులకు పాల్పడడంతో వారు పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. దీంతో ఆ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి సైతం ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డీఈవోకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.
- జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ఈ ఏడాది మార్చిలో ఓ కోచ్ విద్యార్థినులను వేధించడంతో ఆ విషయం బయట పడింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టి అతడిని విధుల నుంచి తప్పించారు. వెకిలిచేష్టలకు పాల్పడినట్లు తేలడంతో ఉద్యోగం నుంచి తొలగించారు.
- మావల మండలం వాఘాపూర్‌లో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతడిని అక్కడి నుంచి మరో పాఠశాలకు బదిలీ చేశారు. ఆ పాఠశాలలో సైతం ఆయన తీరు మారలేదు. విద్యార్థినులు ఆందోళన చేపట్టినప్పటికీ విషయం బయట పొక్కకుండా విద్యాశాఖాధికారులు కప్పిపుచ్చారు.
- తాంసి మండలంలోని ఘోట్కురి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలను విద్యార్థినులకు చూపించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో గ్రామస్తులు ఆయనను పాఠశాలలో బంధించారు. ఈ మేరకు విచారణ జరిపిన డీఈవో అతడిని మరో పాఠశాలకు పంపించారు.
- ఉట్నూర్ మండలం లక్కారం పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. విచారణ జరిపి ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. అలాగే అతడిపై పోక్సో చట్టం కింద కేసు సైతం నమోదైంది.





నేరడిగొండ పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కీచక గురువులు..!

- తరచూ విద్యార్థినులపై వేధింపులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నామమాత్రపు చర్యలతో అడ్డుకట్ట పడని వైనం
- కొందరి తీరుతో విద్యాశాఖకు అప్రతిష్ట

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల భవితకు బాటలు వేయాల్సిన కొంత మంది గురువులు ఆ వృత్తికే కలంకం తీసుకొస్తున్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారు. ఆ బాధను భరించలేక కొందరు బయట పెడుతుండగా, మరికొంత మంది మౌనంగా భరించాల్సిన దుస్థితి. జిల్లాలో కొద్ది రోజులుగా ఇలాంటి ఘటనలే చోటు చేసుకుంటున్నాయి. అయితే ఆ కీచకులపై నామమాత్రపు చర్యలకే పరిమితం కావడంతో వక్రబుద్ధి ఉన్న మిగతా వారి తీరులో మార్పు కానరాని పరిస్థితి. సంఘటనలు బయటకు వచ్చినప్పుడు రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో బయటపడుతున్నారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించాల్సి పోయి వారిపై అసభ్యంగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. దీంతో విద్యాశాఖకే చెడ్డ పేరు వస్తోంది. ఇటీవల నేరడిగొండ జెడ్పీఎస్ఎస్‌లో ఓ కీచక గురువు విద్యార్థినులను వేధించడంతో వారు పాఠశాల ఆవరణలో నిరసనకు దిగారు. గతంలోనూ జిల్లాలో చాలా మంది విద్యార్థులు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే.

టీచర్ల మధ్య గొడవలు..

జిల్లాలోని కొన్ని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇలాంటి ఘటనలు కొన్ని వెలుగుచూస్తుండగా, మరెన్నో బహిర్గతం కావడం లేదన్నట్టు తెలుస్తోంది. అయితే కొన్ని పాఠశాలల్లో తమకు వ్యతిరేకంగా ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులను రెచ్చగొట్టి ఉపాధ్యాయులు తమను వేధిస్తున్నారని చెప్పిస్తున్నట్లు కూడా చర్చ సాగుతోంది. వీరి మధ్య గొడవలు విద్యార్థుల భవితపై ప్రభావం చూపుతున్నాయి. విద్యార్థులు నిరసనకు దిగడంతో విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను పంపిస్తున్నారు. దీంతో అక్కడ పాఠాలు బోధించే టీచర్ల కొరత ఏర్పడుతోంది. గొడవల కారణంగా ఉపాధ్యాయుల పరువు పోవడంతో పాటు విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

కొరవడిన పర్యవేక్షణ..

విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తోటి మహిళ ఉపాధ్యాయులను కూడా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గతంలో పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో ఒక్క రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడం, అలాగు జిల్లా విద్యాశాఖ అధికారి కూడా ఇన్‌చార్జి కావడంతో కొంత మంది ఉపాధ్యాయులు వారి మాటలను పెడచెవిన పెడుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఏవైన ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. తప్పు చేసిన వారికి కనీసం మెమోలు కూడా ఇవ్వకుండా మెతక వైఖరి వ్యవహరించడంతో తమను ఎవరేమి చేయలేదనే ధీమాతో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

వక్రబుద్ధితో..

విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన ఉపాధ్యాయులు కొంత మంది వక్రబుద్ధితో వారిని వేధిస్తున్నారు. ముఖ్యంగా ఈఘటనలు ఉన్నత పాఠశాలల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పాఠశాలల్లో సాధికారత క్లబ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అవి నామామాత్రంగానే మిగిలాయి. విద్యార్థినులపై వేధింపులకు పాల్పడే ఉపాధ్యాయులకు తోటి టీచర్లు మద్దతు పలకడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠాలు బోధించే సమయంలో బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించడం, వెకిలిచేష్టలకు దిగడంతో వారు చదువుపై ఆసక్తి చూపలేకపోతున్నారు. విషయాన్ని తల్లిండ్రులకు చెప్పలేక మదనపడుతున్నారు. ఒకవేళ విషయాన్ని బయట పెడితే తమ చదువులకు ఆటంకం కలుగుతుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఎవరికైనా చెబితే సంగతి చూస్తామని ఈ గురువులే విద్యార్థినులను హెచ్చరిస్తు న్న ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

గురుతర బాధ్యతలు నిర్వర్తించాలి



ఉపాధ్యాయులు గురుతర బాధ్యతలు నిర్వర్తించాలి. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు ఉపాధ్యాయులు వారి భవితకు బాటలు వేయాలి. విద్యార్థినులను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. కొంత మంది తీరు వల్ల విద్యా శాఖకు చెడ్డ పేరు వస్తోంది. ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే మా దృష్టికి తీసుకురావాలి. విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – ప్రణీత, డీఈవో

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి సీతక్క



మంత్రి సీతక్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు చేశారు. ఇన్‌చార్జి మంత్రిగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పథకాలు, పాలన తీరుపై సమీక్షలు, సమావేశాల నిర్వహణ, ప్రజాపాలనపై పర్యవేక్షణ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగే ప్రభుత్వ వ్యవహారాలన్నీ సమన్వయం చేస్తారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆమె ఇన్‌చార్జి మంత్రిగా రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఎస్టీ రిజర్వు కావడంతో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ములుగు ఎమ్మెల్యేను సీతక్కను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వ్యవహరించారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమంపై జిల్లా కేంద్రంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గాయత్రి గార్డెన్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ తదితర నాయకులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీపూర్‌కు బస్సు వచ్చే..



పల్లె బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, చిత్రంలో డీఎం కల్పన

- 'పల్లె వెలుగు'ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్: 'బస్సే రాదాయే..! మహాలక్ష్మి కరుణించేదెలా!' శీర్షికన ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనంతో పాటు ప్రజలు, నాయకులు నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. ఈమేరకు ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం జెండా ఊపి సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కల్పించేలా కృషిచేస్తామన్నారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, నాయకులు జోగు రవి, ఆకుల ప్రవీణ్, దశరథ్, సురేష్, రత్నాకర్ రెడ్డి తదితరులున్నారు.

అప్‌గ్రేడ్

- మినీ అంగన్‌వాడీ కేంద్రాలు.. ఇక మెయిన్‌గా మార్పు
- జిల్లాలో 264 సెంటర్లు
- సిబ్బందికి పెరగనున్న వేతనం
- ఖాళీల భర్తీకి సర్కారు చర్యలు



అంగన్‌వాడీ కేంద్రం (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురునందించింది. మినీ కేంద్రాలూ ఇక ప్రధాన సెంటర్లుగా మారనున్నాయి. ఈమేరకు రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇటీవల ఈ ఫైలుపై తొలి సంతకం చేశారు. దీంతో టీచర్లలో హర్షం వ్యక్తమవుతోంది. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. కొత్త సెంటర్ల ఏర్పాటుకు సైతం సమాయత్తం అవుతోంది. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే మినీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్ల వేతనం కూడా పెరగనుంది. ఈ సెంటర్లలో ఆయాలను సైతం నియమించనున్నారు.

జిల్లాలో..

జిల్లాలో ఉన్న మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందుతుంది. ఇదివరకు 400 నుంచి 800 జనాభా ఉన్న ప్రాంతాల్లో ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని, 800 నుంచి 1600 జనాభా ఉన్న గ్రామాల్లో రెండు కేంద్రాలు, 1600 నుంచి 2400 జనాభా ఉన్న ప్రాంతాల్లో మూడింటిని ఏర్పాటు చేశారు. అలాగే 150 నుంచి 400 జనాభా ఉన్న గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మార్పులు తీసుకొచ్చేందుకు..

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఆ శాఖ మంత్రి మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 264 మినీఅంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం వీటిలో 229 మంది టీచర్లుగా పనిచేస్తున్నారు. 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో అంగన్‌వాడీలే వంట చేయడం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం, ఇంటి నుంచి పిల్లలను తీసుకురావడం, రికార్డులు రాయడం, తదితర పనులు చేస్తున్నారు. మెయిన్ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్ల మాదిరిగానే మిగతా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనంలో వ్యత్యాసం ఉంది. కొన్నేళ్లుగా మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చి వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి సమస్యలపై దృష్టి సారించింది.

మినీ అంగన్‌వాడీలకు ప్రయోజనం..

ప్రధాన కేంద్రాల్లో పనిచేసే టీచర్లకు ప్రస్తుతం రూ.13,650 వేతనం వస్తుండగా, మినీ కేంద్రాల్లో వారికి కేవలం రూ.7,800 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరికి కూడా రూ.13,650 వేతనం చెల్లించనున్నారు. ఈ కేంద్రాల్లో ఆయా పోస్టులు సైతం భర్తీ చేయనుండడంతో వారికి పనిభారం సైతం తగ్గనుంది. లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

ఖాళీలతో సతమతం..

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల టీచర్ల పోస్టులు, మరికొన్ని చోట్ల ఆయాల పోస్టులు, ఇంకొన్ని చోట్ల ఆయాలు, టీచర్లు లేని సెంటర్లు సైతం ఉన్నాయి. పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే పోషకాహార లోపంతో చిన్నారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణు, బాలింతలు అవస్థలు పడుతుండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో 60 టీచర్ పోస్టులు, మినీ కేంద్రాల్లో 35 ఖాళీలు ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో 992 మంది ఆయా పోస్టులకు గాను 859 మంది పనిచేస్తున్నారు. 133 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జిల్లాలో ఆయాలు, టీచర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలు 20 ఉండడం గమనార్హం. 2021లో అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటించినా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పలువురు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు : 1256

మెయిన్ కేంద్రాలు : 992	మినీ కేంద్రాలు : 264
ఇందులో ఖాళీలు : 60	ఇందులో ఖాళీలు : 35

మొత్తం ఆయా పోస్టులు : 992, ఖాళీగా ఉన్నవి : 133

గర్భిణులు : 6876, బాలింతలు : 4168, చిన్నారులు : 25,974

ప్రతిపాదనలు పంపించాం..



జిల్లాలో 264 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం. ఖాళీల భర్తీకి సంబంధించిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో నోటిఫికేషన్ వేసినప్పటికీ కోర్టు కేసు కారణాలతో ప్రక్రియ నిలిచిపోయింది.
– మిల్కా, జిల్లా సంక్షేమ అధికారి

చలి గుప్పిట్లో..

- జిల్లాలో పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఇబ్బందుల్లో జనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాను చలి వణికిస్తుంది. వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం 8.5 డిగ్రీల సెల్సియస్ నమోదైన విషయం తెలిసిందే. ప్రస్తుతం 9 నుంచి 10 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గతేడాది జిల్లాలో రికార్డు స్థాయిలో 3.5 డిగ్రీలకు పడిపోయిన విషయం తెలిసిందే. ఈసారి కూడా చలి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

తోడైన పొగమంచు..

వేకువజామున పనులకు వెళ్లే పారిశుద్ధ్య కార్మికులు, పేపర్‌బాయ్‌లు, పాల వ్యాపారులు చలి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు తోడవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి పంజా విసురుతుంది. గిరిజనులు చలిమంటల ద్వారా ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు ఆదిలాబాద్‌తో పాటు ఆయా మండల కేంద్రాల్లో స్వెట్టర్ల దుకాణాల్లో గిరాకీ పెరిగింది.

వారం రోజులుగా జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు..

తేది	కనిష్ట	గరిష్ట
18	12.7	27.3
19	10.5	27.3
20	9.7	26.3
21	8.5	27.3
22	9.5	28.3
23	12.0	29.3
24	10.7	29.7



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారులు

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ


హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా పాల్గొన్నారు. జిల్లాకు సంబంధించిన పలు విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, ఆయా శాఖల మంత్రులు తదితరులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్‌టౌన్

జాతీయస్థాయికి ఎంపికవడం అభినందనీయం



క్రీడాకారులను సన్మానిస్తున్న శ్రీనివాస్

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఆత్యాపాత్యా సంఘం జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన అభిషేక్ ఆత్యాపాత్యా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆత్యాపాత్యా క్రీడలో రాణించేలా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో నైపుణ్యాలు మెరుగుపరచుకొని క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే అభిషేక్ ఈనెల 27నుంచి 29వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఇటీవల తమిళనాడులోని చెన్నైలో నిర్వహించిన సీనియర్ ఆత్యాపాత్యా పోటీలకు తెలంగాణ జట్టు నుంచి జిల్లా క్రీడాకారుడు టింగని లోకేష్ ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా మండలాల్లో సైతం క్రీడను విస్తరించేలా కృషి చేస్తామన్నారు. ప్రతిభగల క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. ఇందులో సంఘం జిల్లా కార్యదర్శి మేస్రం గణేశ్, కోశాధికారి హరిచరణ్, అజయ్, నవీన్, మజాహర్, జాషువా, శివ తదితరులున్నారు.


నిర్మల్‌లోని క్యాథలిక్ చర్చి


నిర్మల్‌లో ముస్తాబైన చర్చి

ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం



నిర్మల్ జిల్లా కేంద్రంలో...



సోన్ మండలంలోని మాధపూర్ చర్చిలో ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే దృశ్యాలు





ముస్తాబైన చర్చీలు

నిర్మల్‌టౌన్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని చర్చీలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. క్రీస్తు జననాన్ని సూచించే నక్షత్రపు గుర్తులు కలిగిన రంగురంగుల అలంకరణలను క్రైస్తవులు తమ ఇళ్లపై అలంకరించారు. స్థానిక గాజులపేటలోని సీఎస్ఐ చర్చి 1930లో బ్రిటిష్ హయాంలో నిర్మించారు. ఈ చర్చి మెదక్‌లోని చర్చికి అనుబంధం. కాగా ఇక్కడికి ఉమ్మడి జిల్లా నుంచి క్రైస్తవులు వస్తుంటారు. దీంతోపాటు వెంకటాపూర్‌లోని మీస్సి చర్చి మూడేళ్ల క్రితం నిర్మించారు. ఈ చర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అతిపెద్దది. వీటితోపాటు కొండాపూర్ బ్రిడ్జి వద్ద గల సెయింట్ థామస్ చర్చిని సైతం విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం అర్ధరాత్రి దాటే వరకూ వివిధ చర్చల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకలు నిర్వహించుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు.


నిర్మల్ జిల్లా కేంద్రంలో...


నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్‌నగర్‌లో విద్యుత్ దీపాలతో పశువుల పాకలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో..


కడెం: పెద్దబెల్లాల్ సెయింట్ ఆంటోనీస్ చర్చి


ఇచ్చోడ: ఇచ్చోడలో క్రీస్తురాజు దేవాలయం


ఖానాపూర్‌లో..

క్లుప్తంగా

నాగ్‌నాథ్ శివాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే


కుటుంబీకులతో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహంద నాగ్‌నాథ్ శివాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో శనివారం రాత్రి చొరబడి ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసి టీవీని ఎత్తుకెళ్లారు. గమనించిన స్థానికులు ఇంటి యజమానికి తెలియజేయడంతో చోరీ జరిగిన విషయం తెలిసింది. బాధితుడు శివ కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఊపిరి ఆగుతోంది..!

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విదేశాల నుంచి నెల రోజుల సెలవు నిమిత్తం వచ్చాడు. ఇక్కడ నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో గత బుధవారం గృహప్రవేశం చేశాడు. మూడవ రోజునే గుండెపోటుతో కుప్పకూలాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు..

జిల్లా కేంద్రానికి చెందిన ఓ న్యాయవాది తరచూ తనకున్న పరిచయాలమూలంగా మిత్రులతో అప్పుడప్పుడు విందుల్లో పాల్గొనడం, మద్యం సేవిస్తుండడం చేస్తుండేవాడు. ఆహారపు అలవాట్లు కూడా ప్రణాళికాబద్ధంగా ఉండకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వైద్యులను సంప్రదించగా అప్పటికే కాలేయం దెబ్బతిందని తెలిపారు. ఈ పరిణామంతో మానసికంగానూ కృశించిపోయాడు. గత పక్షంరోజుల క్రితం మృతిచెందాడు.

సారంగాపూర్ మండలంలోని చించోలి-బి గ్రామానికి చెందిన సుమారు 45 ఏళ్ల వ్యక్తి గల్ఫ్‌లో పనిచేస్తూ తిరిగి వచ్చాడు. ఒక రోజు ఒంట్లో జ్వరంగా ఉండి దగ్గుతుండగా ఆకస్మికంగా రక్తం బయటకు వచ్చింది. దీంతో పరీక్షలు చేయించుకున్న ఆ వ్యక్తి అప్పటికే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయిందని, కాలేయం, పాంక్రియా తదితర భాగాలు మద్యపానం సేవించడంతో దెబ్బతిన్నాయని వైద్యులు తెలుపడంతో నీరసించిపోయాడు. అప్పటి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వారం రోజుల్లో మృతిచెందాడు.

- పెరుగుతున్న హృద్రోగ, కాలేయ సమస్యలు
- జిల్లాలో తరచుగా ఆకస్మిక మరణాలు
- నాలుగుపదుల వయసువారే అధికం
- అసమతుల్య ఆహారపు అలవాట్లు, జీవనశైలే కారణం
- క్రమబద్ధమైన నియమాలు పాటించాలంటున్న ఆరోగ్యనిపుణులు


ఉదయం వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు తరచుగా మృతి చెందుతూ ఉండడం ఆందోళనలకు గురిచేస్తోంది. ప్రణాళిక లేని ఆహారపు అలవాట్లు, మద్యపానం, సరైన వ్యాయామం లేకపోవడం, క్రిమిసంహారక మందులతో పండించిన కూరగాయలు, దినుసులు వంటివాడకం మితిమీరిపోవడంతోనే ఇలాంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఎన్నో కారణాలు...

ప్రధానంగా గుండె లయతప్పడానికి ఎన్నో అంశాలు ప్రభావం చూపుతాయి. కొన్నిసార్లు పెద్దగా కారణాలేవి లేకుండానే ఇటువంటి ప్రమాదం సంభవిస్తుంది. కొందరిలో మాత్రం గుండె కండరం మందం కావడం, పుట్టుకతో గుండెలో ఉండే లోపాలు, కర్ణికలు పెద్దగా ఉండడం, జన్యుపరంగా తలెత్తే ఇతర ఇతర సమస్యలు రక్తంలో ఖనిజలవణాల సమతుల్యత లోపించడం, మానసిక ఒత్తిడి నిద్రలేమి వంటివి కారణమవున్నాయి. బాగున్న కండరం మధ్యభాగంలోని కణాలు అతి చురుకుగా స్పందించడంతో కూడా గుండె కొట్టుకునే వేగం పెరుగుతోంది. దీంతో శరీరానికి రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, ఫలితంగా తలతిరగడం, స్పృహ తప్పి కోల్పోవడం, నిమిషాల వ్యవధిలోని మరణం సంభవించడం వంటి వాటికి ఆస్కారం ఉంటుంది.

జీవనశైలిలో మార్పుతోనే నివారణ...

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు అనేక ఒత్తిడిలతో కూడిన జీవన విధానంలో ప్రశాంతత లోపించడం సమయభావంతో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఉదయం నడక, వ్యాయామక కసరత్తులు, యోగా, మెడిటేషన్ వంటివి నిపుణుల పర్యవేక్షణలో చేయడంతో ఆరోగ్యంగా ఉండగలుగుతాము. కాలేయ సంబంధ వ్యాధుల్లో ప్రధానంగా ఆహారపు అలవాట్లు ప్రభావం చూపుతాయి. సరైన ఆహారపు అలవాట్లు లేని వ్యక్తుల్లో సమస్యలు తలెత్తడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

శరీరాన్ని సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి



ఈ రోజుల్లో ఎటువంటి ఆరోగ్య సమస్య ఎటువైపు నుంచి ముంచుకొస్తుందో తెలియనిస్థితిలో ఉన్నాం. ఆరోగ్యపరంగా శరీరాన్ని సమతుల్య స్థితిలో ఉంచుకునే విధంగా నియమాలు పాటించాలి. ఆహారం పరంగా, శారీరకంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎండపెల్లి అశోక్‌కుమార్, మైథిలీ వెల్‌నెస్ సెంటర్, నిర్మల్

నిరంతర పరీక్షలతోనే నివారణ



గుండె సంబంధిత జబ్బులు ప్రస్తుత కాలంలో అధికమవుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసులవారు గుండె, కాలేయ సంబంధ సమస్యలకు గురవుతున్నారు. గుండె జబ్బులు ఇతర అనారోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరీక్షలను చేయించుకోవాలి.

– డాక్టర్ ఎం.ఎస్. ఆదిత్య, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్

ఆర్మీ జవాన్ ఆత్మహత్య


గడ్ చందా రమేష్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. దీంతో కాలనీలో విషాదం నెలకొంది. పట్టణ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.. స్థానిక వెంకటాపూర్ కాలనీకి చెందిన గడ్ చందా రమేష్ (28) ఆర్మీ జవాన్. కోల్‌కత్తా బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ 15న తన బామ్మర్ది వివాహం నాగంపేట్ ముప్కల్ మండలంలో ఉండడంతో వచ్చాడు. వేడుకలు ముగించుకొని ఆదివారం ఉదయం తన ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో ఇంట్లో వారు చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అక్కడికి చేరుకున్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ శివారులో శ్రీరాముల రమణయ్య (54) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భైంసా పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన శ్రీరాముల రమణయ్య గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గత రెండు రోజుల క్రితం నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. హజ్గుల్ గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

'కూచిపూడి గిన్నిస్‌రికార్డు'లో ఖానాపూర్ చిన్నారులు

ఖానాపూర్: తెలుగువారి సాంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ఆదివారం భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించారు. ఈ క్రమంలో 8వేల మంది కూచిపూడి కళాకారులంతా ఏకమై అరుదైన గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ కళాకారుల బృందంలో ఖానాపూర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు పాల్గొన్నారు. మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన సోని-శివరామకృష్ణ దంపతుల కూతురు శన్వికతో పాటు గోడలపంపు గ్రామానికి చెందిన శ్రవంతి-రాజ్‌కుమార్‌ల కూతురు వైశాలి, రాజూరా గ్రామానికి చెందిన ఉమా-రోహిదాస్‌ల కూతురు బార్గవి పాల్గొని నృత్యం చేశారు. అనంతరం చిన్నారులకు గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందించారని నాట్య గురువులు నవ్యవినయ్, అంజలితో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.


గిన్నిస్‌రికార్డ్ సర్టిఫికెట్


కూచిపూడి ప్రదర్శనలో చిన్నారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని విద్యార్థులు మళ్లీ అదే చోట 16ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఉపాధ్యాయుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. 2006-07లో పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.

